సాక్షి
నిజామాబాద్

గురువారం । 11 । జూలై । 2024



నిధులు లేక నిస్తేజం
గ్రామ పంచాయతీలకు మూడు నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో మౌలిక సదుపాయాల కల్పన కష్టంగా మారింది.

- 8లో ▸



ఎత్తిపోతల మోటార్లు ప్రారంభం
మంజీర నదిపై సాలూర శివారులోని ఎత్తిపోతల పథకం మోటార్లను బుధవారం నిర్వహణ కమిటీ సభ్యులు ప్రారంభించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /24.8

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై కంట్రోల్ రూం ఏర్పాటు
సుభాష్‌నగర్: సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లాస్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడైనా సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే 73864 29323, 90597 64785 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమాచారం ఇవ్వొచ్చని పేర్కొన్నారు. వర్షాకాలంలో మలేరియా, చికున్ గున్యా, అతిసారం, విషజ్వరాలు ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు


బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఓ వైపు ఆస్పత్రిలో వైద్యుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు ఆస్పత్రికి వచ్చిన రోగులను సిబ్బంది ఒకే బెడ్‌పై పడుకోబెట్టి చికిత్స చేస్తున్నారు. ఇదేమిటని రోగులు సిబ్బందిని ప్రశ్నిస్తే బెడ్స్ లేవని సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు. ఆస్పత్రిలో వసతుల కల్పనపై వైద్యశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టి సారించాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు
బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. డ్యూటీలు, సెలవుల విషయంలో అసిస్టెంట్ మేనేజర్ డబ్బులు తీసుకుంటున్నారని, వేధింపులకు గురిచేస్తున్నారని కార్మికులు, సిబ్బంది ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారం పాటు విజిలెన్స్, ఆర్టీసీ అధికారులు డిపోలో విచారణ జరిపి, నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. నివేదికను పరిశీలించిన ఉన్నతాధికారులు.. అసిస్టెంట్ మేనేజర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్‌ను సస్పెండ్ చేశారని డీఎం శ్రీదేవి తెలిపారు.

మందకొడిగా వరినాట్లు

వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటుతున్నా జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకోలేదు. వర్షాలు ముఖం చాటేయడంతో మందకొడిగా సాగుతున్నాయి. వానలు పడకపోవడంతో అన్నదాతలు ఆకాశంవైపు చూస్తున్నారు. కేవలం బోర్లపై ఆధారపడి సాగు చేసే రైతులే వరి నాట్లు వేస్తున్నారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు కనీసం సగం కూడా వరి నాట్లు పూర్తి కాలేదు.



డొంకేశ్వర్‌లో నాట్లు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

- ఇప్పటి వరకు సాగైంది 43 శాతమే
- అది కూడా బోర్ల కిందనే..
- వర్షాల కోసం ఆకాశంవైపు చూస్తున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో వరినాట్లు మందకొడిగానే సాగుతున్నాయి. ఇటీవల కురిసిన కొన్ని వర్షాలకు పుంజుకున్నట్లు కనిపించిన నాట్లు వర్షాలు పడకపోవడంతో మళ్లీ నెమ్మదించాయి. ప్రస్తుతం బోర్లున్న రైతులే ధైర్యం చేసి నాట్లు వేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర అవుతున్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా సగం నాట్లు కూడా పడలేదు. వ్యవసాయ శాఖ వేసిన అంచనా ప్రకారం 4.30 లక్షల ఎకరాలకు పైగా వరి సాగు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 1.71లక్షల ఎకరాల్లో మాత్రమే(43శాతం) సాగైంది. గతేడాది ఇదే సమయానికి 2 లక్షల ఎకరాలు దాటింది. వర్షాలలేమి కారణంగా ఈ ఏడాది రైతాంగం వరిసాగులో వెనుకబడుతోంది. ఒకపక్క నారు ఎదిగి రంగుమారుతున్నా వర్షాలు రాకపోతాయా అని వేచి చూస్తున్నారు. రెండు గట్టి వర్షాలు పడితే నాట్లు వేద్దామని భావిస్తున్నారు. ఇందుకు ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేసి సిద్ధంగా ఉంచుకుంటున్నారు. అయితే, వర్షాలు ఇంకా ఆలస్యమైతే లిఫ్టుల ద్వారా పొలాలకు సాగునీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జలాశయాల్లో కూడా ఆశించినంతగా జలాలు లేవు. ఉన్న కొద్ది నీటితో కొన్ని రోజులు మాత్రమే పంటలను గట్టెక్కించుకోవడానికి అవకాశం ఉంది. ఆ తర్వాత బోర్లను అరువుకు తీసుకోవాల్సి వస్తుంది.

వలస కూలీలకు నెమ్మదిగానే పని..
వరినాట్లు వేసేందుకు జిల్లాకు ఎప్పటిలాగే మహారాష్ట్ర, యూపీ, ఏపీ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచే కాకుండా నల్గొండ జిల్లా నుంచి కూడా వలస కూలీలు వచ్చారు. వారికి మధ్యవర్తులుగా ఉన్న మునీంలే గ్రామాల్లో వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. వరినాట్లు మందకొడిగానే సాగుతుండడంతో వలస కూలీలకు కూడా పని నెమ్మదించింది. తీరిక లేకుండా పనిచేసే వీరితో పని కుదుర్చుకోవడానికి రైతులకు వారం రోజుల సమయం పట్టేది. ఇప్పుడు ఒక్కరోజు కూడా పట్టడం లేదు. అనుకున్న పని లేక ఉపాధి తగ్గిందని కూలీలు పేర్కొంటున్నారు. వలస వచ్చిన కూలీలు పది, పన్నెండు మంది కలిసి రోజుకు నాలుగైదు ఎకరాల వరకు నాట్లు వేస్తున్నారు. నాట్లు వేసిన కూలీల బృందానికి ఎకరానికి రూ. 4,500 నుంచి రూ. 4,800 వరకు రైతులు కూలీ చెల్లిస్తున్నారు. వరినాట్లు పెద్దగా పడకపోవడంతో ఇటు ఎరువుల బస్తాల కొనుగోళ్లు సైతం నెమ్మదించాయి.

మాజీ పోలీస్ కమిషనర్ సంతకం ఫోర్జరీ

- విచారణలో గుర్తించిన స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది
- ఘటనపై సీపీ కల్మేశ్వర్ సీరియస్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాజీ పోలీసు అధికారి సంతకం ఫోర్జరీ ఘటన కలకలం రేపింది. ఈ వ్యవహారంపై సీపీ కల్మేశ్వర్ సీరియస్ అయ్యారు. ప్రస్తుతం ముఠాలోని ఐదుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట్ మండలానికి చెందిన ధర్‌సింగ్ అనే వ్యక్తికి విదేశాలకు వెళ్లేందుకు పోలీసు క్లియరెన్స్ సరిఫికెట్ (పీసీసీ) అవసరం ఉండడంతో స్థానికంగా ఏజెంట్‌ను సంప్రదించాడు. ఆ ఏజెంట్ ఫోర్జరీ ముఠా సభ్యులతో మాట్లాడి నకిలీ పీసీసీ సృష్టించి ధర్‌సింగ్‌కు ఇచ్చాడు. అయితే ఆ పీసీసీలో గతంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన ప్రస్తుత వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు డిజిటల్ సంతకం ఉంది. ఎంక్వైరీలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించారు. నెల రోజుల క్రితమే తీసిన పీసీసీపై గత సీపీ సంతకం ఉండడంపై అనుమానం రావడంతో విచారించి ఫోర్జరీ సంతకంగా తేల్చారు. ఈ విషయం నవీపేట్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా ఫోర్జరీ ముఠా అప్పటికే మరో ఐదుగురికి నకిలీ సంతకంతో పీసీసీ ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గుడి భూమిని మింగేశారు



కాకయ్య గుడి

- గుడిని మాత్రమే వదిలారు..
- తల్వేద గ్రామంలో కాకయ్య గుడి రికార్డులను మాయం చేసిన కేటుగాళ్లు
- రెవెన్యూ, ఇరిగేషన్ సంయుక్త సర్వేలో నిగ్గుతేలిన అక్రమం
- ప్రైవేటు పట్టాను రద్దు చేసిన అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి
- కోర్టుకు వెళ్లిన ఆక్రమణదారు
- ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయకుండా కథ నడిపిన వైనం
- ప్రభుత్వం మారడంతో తాజాగా కౌంటరు దాఖలు చేసిన రెవెన్యూ అధికారులు
- సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలోని నందిపేట మండలం తల్వేద గ్రామస్తుల ఆరాధ్య దైవం కాకయ్య (కాకేశ్వర స్వామి) స్వామి. అయితే ఇదే గ్రామానికి చెందిన ఓ కుటుంబం గుడిని మాత్రం వదిలేసి గుడి ఉత్సవాలు చేసే స్థలాన్ని ఆక్రమించింది. పైగా గతంలో రెవెన్యూ ఉద్యోగిగా చేసి రిటైరైన వ్యక్తి కాకయ్య స్వామి గుడి రికార్డులను సైతం మాయం చేసి తన కుటుంబం పేరు మీదకు మార్చుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గుడికి ఎకరం మూడు గుంటల భూమి ఉండగా.. అందులో ఎకరం భూమిని బైనంబర్‌తో మింగేశారు. అయితే ఆక్రమిత గుడి భూమి కోసం గ్రామస్తులు ఏళ్లతరబడి పోరాటం చేస్తున్నారు. దీంతో గతంలో జిల్లాలో పనిచేసిన కలెక్టర్ నారాయణరెడ్డి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సంయుక్త సర్వే చేయించారు. దీనిపై సదరు ఆక్రమణదారుడు కోర్టుకు వెళ్లాడు. పైగా ప్రభుత్వం కోర్టులో కౌంటరు సైతం దాఖలు చేయకుండా చక్రం తిప్పాడు. ప్రభుత్వం మారడంతో తాజాగా రెవెన్యూ యంత్రాంగం కోర్టులో కౌంటరు దాఖలు చేయడం విశేషం. గ్రామానికి చెందిన లోక సాయరెడ్డి, ఈర్నపల్లి నరేష్ గౌడ్ సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి పోరాటం చేస్తున్నారు.

■ 1980లో తల్వేద గ్రామం శ్రీరాంసాగర్ జలాశయంలో ముంపునకు గురైంది. దీంతో ప్రస్తుతం ఉన్న చోట ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ముంపునకు గురైన గ్రామంలో 440 ఏళ్ల చరిత్ర కలిగిన కాకయ్య స్వామి గుడిని కొత్త గ్రామంలో 1980 మే 2న గ్రామస్తులు పునఃప్రతిష్ట చేశారు. దీనికి 2–11 ఇంటి నంబర్ కేటాయించారు. గుడి కోసం ప్రభుత్వం కేటాయించిన సీలింగ్ భూమికి సంబంధించి 3 గుంటల్లో గుడిని నిర్మించారు. మిగిలిన ఎకరంలో అన్నదానం, ఇతర ఉత్సవాలు చేస్తూ వచ్చారు. భక్తిభావం ఎక్కువగా కలిగిన ఈ గ్రామస్తులు ప్రతి గురువారం అన్నదానం చేస్తారు. ఈ క్రమంలో 1987లో బైనంబర్‌తో గుడి రికార్డులను మాయం చేసి ఎకరం భూమి ని ఆక్రమించారు. తాజాగా ప్రభుత్వం కోర్టులో కౌంటరు దాఖలు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాకయ్య స్వామి భూమి తిరిగి గుడికి దక్కనుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



గుడి భూమిలో నిర్మించిన గోడ, రైస్ మిల్లు

బడికెళ్లాలంటే.. మూడు కి.మీ. నడవాల్సిందే

- బాల్కొండ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థుల ఇక్కట్లు
- సంవత్సరాలు గడుస్తున్నా బస్సు సౌకర్యం కల్పించని వైనం



హాస్టల్ నుంచి కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కలగానే మిగిలిపోయింది. పుష్కర కాలం పూర్తయినా ఇప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లాలంటే రాను, పోనూ మూడు కిలోమీటర్లు నడవాల్సిందే. లేదంటే చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను వన్నెల్(బి) గ్రామ శివారులోని రోడ్డు పక్కన నిర్మించారు. పాఠశాల మండల అభివృద్ధి కార్యాలయాల వద్ద ఉంది. హాస్టల్ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు 1.5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. హాస్టల్ విద్యార్థులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే చదువుకోవాలి. హాస్టల్‌లో 300 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విద్యార్థులు ప్రతిరోజూ కాలినడక న వచ్చి వెళ్తున్నారు. హాస్టల్ ప్రారంభ సమయంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పిస్తామని పాలకులు తెలిపారు. కానీ 12 ఏళ్లు గడిచినా అమలుకు నోచుకోవడంలేదు. ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే పాత జాతీయ రహదారి 44ను దాటి వెళ్లాలి. వన్నెల్(బి) చౌరస్తా వద్ద ట్రాఫిక్ అధికంగా ఉండడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. అయినా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఇబ్బందికరంగా ఉంది



పాఠశాలకు కాలినడకన రోజూ వెళ్లడం ఇబ్బందిగా ఉంది. బస్సు సౌకర్యం కల్పిస్తామని సంవత్సరాల నుంచి అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. వెంటనే బస్సు నడిపించాలి.

– గణేశ్, విద్యార్థి

రోడ్డు దాటాలంటే భయం



పాత జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా భయంగా ఉంటుంది. రోడ్డుపై భారీ వాహనాలు వస్తుంటాయి. సాయంత్రం పూట మరీ ఎక్కువగా ఉంటాయి. ఉన్నతాధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం బస్సు ఏర్పాటు చేయాలి.

– దినేశ్, విద్యార్థి




రాళ్లల్లో రతనాల సేద్యం..
చుట్టూ ఎటుచూసినా రాళ్లే.. అలాంటి భూముల్లో రతనాల సేద్యం చేస్తున్నారు కొందరు రైతులు. రాళ్ల నడుమ పంటలను పండిస్తూ సిరులు కురిపిస్తున్నారు. మోపాల్ మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన ఎల్లమ్మకుంట తండా శివారులోని భూములు రాళ్లతో నిండిపోయాయి. ఈ భూముల్లో కొందరు గ్రామ రైతులు మొక్కజొన్న పంట వేశారు. విత్తనాలు మొలకెత్తి పెరుగుతున్నాయి.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

చేపపిల్లల పంపిణీకి పచ్చజెండా


- రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో మొదలైన టెండర్లు
- జిల్లాలో వచ్చేనెల 967 చెరువుల్లో 4.54 కోట్ల చేపపిల్లలు వదలనున్న అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): చేప పిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఏడాది (2024–25) జిల్లాలోని చెరువుల్లో ఉచితంగా 4.54 కోట్ల చేప పిల్లలను వదలాలని నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లు నిర్వహించడానికి జిల్లా మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. అధికారులు బుధవారం నుంచే టెండర్లను ఆహ్వానించారు. ఈ నెల 23 వరకు టెండర్లకు అవకాశం ఉండగా, టెండర్‌ను ఎప్పటిలాగే ఈ–ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. గుత్తేదార్లు ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ వేయాల్సి ఉంటుంది. 23న మధ్యాహ్నం మూడు గంటల తర్వాత అదనపు కలెక్టర్ సమక్షంలో టెండర్లను తెరవనున్నారు. టెక్నికల్ బిడ్‌ను తెరిచిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తారు. గుత్తేదార్లు నిర్వహిస్తున్న ఫిష్ ఫాంలను పరిశీలించిన తర్వాత అంతా ఓకే ఉంటే ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవనున్నారు. తదనంతరం టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ల ద్వారా ఆగస్టులో చేపపిల్లలను చెరువుల్లో వదలనున్నారు. ఈ లోపు వర్షాలు కురిస్తే చెరువులు కొంత నిండే అవకాశం ఉంది. 35–40 ఎంఎం సైజు గల చేప పిల్లలు 2.71 కోట్లు, 80–100 ఎంఎం సైజున్న పిల్లలను 1.82 కోట్లు వదలనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య 'సాక్షి'కి తెలిపారు. టెండర్లు, చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపడతామన్నారు.

చెరువులను తగ్గించారు..
ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ లక్ష్యంతో పాటు చెరువుల సంఖ్యను కూడా తగ్గించారు. గతేడాది 4.71కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యం పెట్టుకోగా, ఏడాది 4.54 కోట్లకు తగ్గించారు. ఈ చేప పిల్లల విలువ సుమారు రూ. 4.20 కోట్ల వరకు ఉంటుంది. చెరువులు కూడా 1,018 ఉండగా, 967 చెరువుల్లోనే చేప పిల్లలు వదలాలని నిర్ణయానికి వచ్చారు. బొచ్చ, రవాట, బంగారుతీగ లాంటి రకాల చేప పిల్లలను వదిలేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే, చెరువులు చిన్నవిగా ఉండడంతో పాటు వాటి ఉత్పాదకత లేకపోవడంతో 51 చెరువులను తగ్గించారు. జిల్లాలోని 354 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉన్నాయి. సంఘ సభ్యుల సమక్షంలో సంబంధిత చెరువుల్లో చేప పిల్లలను వదలనున్నారు. ఎట్టకేలకు చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం కొనసాగించడంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన కాసుల బాల్‌రాజ్



బాన్సువాడ: ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, బాన్సువాడ, జుక్కల్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రావు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎత్తిపోతల స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

మాక్లూర్: గోదావరి నీరు ఆధారంగా గుంజ్లి, చిక్లీ శివారులో నిర్మించనున్న మినీ ఎత్తిపోతల నిర్మాణ స్థలాన్ని బుధవారం ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు.. పూర్తి కావడానికి ఎంత కాలం పడుతుందనే విషయాలను కాంట్రాక్టర్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి నది నుంచి ఎత్తిపోసిన నీరు బినోల, అక్కడి నుంచి కంఠం, ఇక్కడ ఎత్తిపోసిన నీరు గుంజ్లి, చిక్లీ శివారులో నిర్మించే ఎత్తిపోతల బావిలో పడుతుందని అధికారులు వివరించారు. అక్కడి నుంచి పంపుల ద్వారా ఎత్తిపోసిన నీరు 1,313 మంది రైతులకు సంబంధించి 3,100 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పథకాన్ని పూర్తిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగారావు, సురేష్‌నాయక్, గుండారం శేఖర్, అడేంధర్, సుధాకర్, సుమన్, రాజేశ్వర్, పీర్‌సింగ్, సత్యం పాల్గొన్నారు.

లిఫ్టులకు పూర్వ వైభవం తేవాలి

డొంకేశ్వర్: మండలంలోని ఎత్తిపోతల పథకాలకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మారంపల్లి, నికాల్‌పూర్ లిఫ్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లిఫ్టుల మరమ్మతులు త్వరగా పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తేవాలన్నారు. పాడైన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు రిపేర్లు చేయాలని దొంగతనాలు జరగ కుండా లిఫ్టుల చుట్టూ కంచెలు వేయాలని సూచించారు. అదనపు నిధులు, లిఫ్టుల వరకు రోడ్లు వేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు యశస్విని, రామారావు, రవికుమార్, దివ్యభారతి, ప్రవీణ్ రెడ్డి, తదితరులున్నారు.



గుంజ్లి శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

భవన నిర్మాణానికి స్థల పరిశీలన



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్‌ అసోసియేషన్‌ భవన నిర్మాణం కోసం జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల బుధవారం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బార్‌ అసోసియేషన్‌ భవన్‌లో జిల్లా న్యాయమూర్తిని.. సీనియర్‌ సివిల్‌ జడ్జి నసీమా సుల్తానా, న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు శంకర్‌, సెక్రెటరీ అరుణ్‌, పీపీ ఖాందేశ్‌ శ్రీనివాస్‌, లీగల్‌ ఎడ్‌ కౌన్సిల్‌ మెంబర్‌ ఖాందేశ్‌ సంగీత, సీనియర్‌ న్యాయవాదులు భూపతిరెడ్డి, జీజీ రాం, శ్రీధర్‌, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి సరికాదు

ఖలీల్‌వాడి: సిద్దిపేట బార్‌ అసోసియేషన్‌ సభ్యుడు, న్యాయవాది రవి కుమార్‌పై స్థానిక అసిస్టెంట్‌ సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఉమారెడ్డి భౌతిక దాడికి పాల్పడడాన్ని ఖండిస్తున్నామని నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జగన్‌ మోహన్‌గౌడ్‌ అన్నారు. కక్షిదారుని బెయిల్‌ జమానాతు పేపర్లు సమర్పించేందుకు వెళ్లిన సమయంలో కావాలని కాలయాపన చేయడం ఒక నేరమైతే, న్యాయవాదిపై దాడి చేయడం మరొక నేరమని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన పోలీసు అధికారి ఉమా రెడ్డిని సర్వీసు నుంచి సస్పెండ్‌ చేయాలని, విచారణ చేపట్టి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్‌ చేశారు.

నేడు కోర్టు విధుల బహిష్కరణ

ఫెడరేషన్‌ ఆఫ్‌ బార్‌ అసోసియేషన్‌ తెలంగాణ రాష్ట్ర కమిటీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కోర్టు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చిందని జగన్‌ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం బార్‌ అసోసియేషన్‌ అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

నిధులు లేక నిస్తేజం

- పల్లెల్లో పరిష్కారానికి నోచుకోని సమస్యలు
- నిలిచిన విద్యుత్‌ బిల్లులు, ట్రాక్టర్‌ ఈఎంఐల చెల్లింపు
- వేతనాలు అందక జీపీ కార్మికులకు ఇబ్బందులు



జలాల్‌పూర్‌ గ్రామ పంచాయతీ కార్యాలయం



ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్‌)

నిజామాబాద్‌రూరల్‌: గ్రామ పంచాయతీలకు మూడు నెలలుగా నిధులు మంజూరుకాకపోవడంతో సిబ్బందికి వేతనాలు, మౌలిక సదుపాయాల కల్పన కష్టం మారింది. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలకు 14, 15 ఫైనాన్స్‌ కమిషన్‌, స్టేట్‌, సెంట్రల్‌ ఫండ్స్‌ మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో పల్లెల్లో చిన్న సమస్యను పరిష్కరించాలన్నా ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌, మే, జూన్‌ నెలలకు సంబంధించి గ్రామ పంచాయతీలకు సుమారు రూ.24 కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో విద్యుత్‌ బిల్లులు, ట్రాక్టర్ల ఈఎంఐల చెల్లింపు నిలిచిపోయాయి. చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కారానికి నోచుకోవడం లేదు. నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులతోపాటు ప్రత్యేక అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. మేజర్‌ గ్రామ పంచాయతీల్లో పన్ను వసూలైతే ఆ డబ్బులతో సిబ్బందికి వేతనాలు ఇస్తుండగా, చిన్న గ్రామ పంచాయతీల్లో పరిస్థితి దారుణంగా ఉందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల వేడుకోలు..

నిజామాబాద్‌ రూరల్‌ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది తమ గ్రామాలకు పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమకు జిల్లా కేంద్రంలోని మండల పరిషత్‌కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే వారు లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు మంజూరవుతాయో లేదోనని అందరూ ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వానికి విన్నవించాం

జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలకు ఏప్రిల్‌, మే, జూన్‌ నెలలకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించాం. ప్రతి గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు కోసం స్పెషల్‌ డ్రైవ్‌ను ప్రత్యేకంగా చేపట్టాం. రూ.24కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంది.

– తరుణ్‌కుమార్‌, జిల్లా పంచాయతీ అధికారి

సాలూర ఎత్తిపోతల మోటార్లు ప్రారంభం



మోటార్లను ప్రారంభిస్తున్న చైర్మన్‌ సురేశ్‌పటేల్‌

బోధన్‌: సాలూర మండల కేంద్రం శివారులోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం మోటార్లను బుధవారం పథకం నిర్వహణ కమిటీ చైర్మన్‌ ఖయ్యూస్‌ సురేశ్‌పటేల్‌.. ప్రతినిధులు, రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి చొరవతో ఎత్తిపోతల పథకం రూపుదాల్చిందన్నారు. ఈ పథకం కింద స్థిరీకరించిన 1600 ఎకరాల ఆయకట్టులో వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి రెండు పంటలకు సాగు నీరందుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ సమస్య ఏర్పడి పథకం ఆగిపోగా, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మరమ్మతులు చేయించి ఎత్తిపోతల పథకాన్ని మళ్లీ ఉపయోగంలోకి తీసుకొచ్చారని అన్నారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యేకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎత్తిపోతల పథకం నీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. ప్రతినిధులు, రైతులు అల్లె రమేశ్‌, మైదపు నాగరాజు, బుద్దె లక్ష్మణ్‌, కందిమల్‌ లక్ష్మణ్‌, డిస్కో సాయిలు, ఆర్టీసీ భూమయ్య, సాయిరెడ్డి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సంపద వనాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ అంకిత్‌

మాక్లూర్‌: మండలంలోని పలు గ్రామాల్లో అదనపు కలెక్టర్‌ అంకిత్‌ బుధవారం పర్యటించారు. అమ్మ ఆదర్శ కమిటీల పాఠశాలలతోపాటు సందపవనాలను పరిశీలించారు. సింగంపల్లి తండాలోని సంపద వనం, వైకుంఠధామాన్ని పరిశీలించిన ఆయన పిచ్చి మొక్కలను తొలగింపజేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వైకుంఠధామాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం డీకంపల్లి, కొత్తపల్లి, కల్లెడి, ధర్మోరా గ్రామాల్లోని అమ్మ ఆదర్శ బడులను సందర్శించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనులను పర్యవేక్షించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఆయనవెంట ఎంపీడీవో జె క్రాంతి, మండల ప్రత్యేక అధికారి జె ముత్తెన్న, ఎంపీవో టీ శ్రీనివాస్‌, ఏఈ శ్రీనివాస్‌, ఉపాధి హామీ ఏపీఎం ఓంకార్‌ ఉన్నారు.

బీర్షేబా ఆస్తులను కొనుగోలు చేస్తే చర్యలు



ఇంటిని సీజ్‌ చేస్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్‌: అమాయకులను మోసం చేసిన వ్యవహారంలో బీర్షేబా కంపెనీకి చెందిన సీజ్‌ చేసిన ఆస్తులను ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ చంద్రశేఖర్‌ హెచ్చరించారు. సీజ్‌ చేసిన ఇల్లును కొనుగోలు చేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. 2020లో వివేకానంద కాలనీలో కొనసాగిన బీర్షేబా కంపెనీపై కేసుతోపాటు ఆ కేసులో నేరస్తుడైన షేక్‌ ఇస్మాయిల్‌, అతడి భార్య సమీనా ఆస్తులను సీజ్‌ చేశారు. ఇస్మాయిల్‌ తన భార్య పేరిట వివేకానంద కాలనీలో ఉన్న సీజ్‌ చేసిన ఇంటిని, ఓ ప్లాట్‌ను పట్టణానికి చెందిన లాలమ్మల అంజన్‌కుమార్‌ 2023లో కొనుగోలు చేశాడు. సీజ్‌ చేసిన ఇంటిలోని సామగ్రిని బుధవారం వ్యాన్‌లో తరలిస్తుండగా స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. బీర్షేబా కంపెనీకి చెందిన ఆస్తులను ఎవరైనా కొనుగోలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఫోర్జరీ సంతకాలతో హోమ్‌లోన్స్‌

- కమీషన్ల కోసం మధ్యవర్తుల కక్కుర్తి
- నస్రుల్లాబాద్‌ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులకు ఫిర్యాదు

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): గ్రామ పంచాయతీ స్టాంపులు ముద్రించి, రసీదు బుక్కులు తయారు చేసి కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ముగ్గురు వ్యక్తులు లోన్‌లు తీసుకున్న ఘటన నస్రుల్లాబాద్‌ మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రైవేట్‌ ఫైనాన్స్‌ బాధ్యులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకుండా లోన్‌లు మంజూరు చేసినట్లు తెలిసింది. మండలంలోని హాజీపూర్‌ గ్రామానికి చెందిన సాలావత్‌ మంగ్యా సర్వే నంబర్‌ 22/4/1లో పౌల్ట్రీఫామ్‌ ఏర్పాటుకు నకిలీ ఎన్‌వోసీ తయారు చేశాడు. అలాగే గ్రామానికి చెందిన నేనావత్‌ శ్రీకాంత్‌, సలావత్‌ శ్రీను సైతం గ్రామ పంచాయతీ స్టాంపులు, రసీదు బుక్కులు తయారు చేయించి గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇళ్ల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం ఆ పత్రాలతో ఓ ప్రైవేట్‌ ఫైనాన్స్‌లో ఒకరు రూ.4లక్షలు, మరొకరు రూ.5లక్షల లోన్‌ తీసుకున్నారు. సదరు వ్యక్తులు రెండు నెలలుగా ఈఎంఐలు చెల్లించకపోవడంతో వసూలుకు వచ్చిన ప్రైవేట్‌ ఫైనాన్స్‌ సిబ్బందికి అసలు విషయం తెలిసింది. వారు వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై కార్యదర్శి రజిత ఈనెల 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేసు బుక్‌ చేయడం లేదు

హాజీపూర్‌ ఘటనపై ఫైనాన్స్‌ అధికారులు తమకు ఫిర్యాదు చేయగానే మేము పోలీసులకు ఫిర్యాదు చేశాం. గత మూడు రోజులుగా కేసు బుక్‌ చేస్తామని, కొత్త చట్టం వచ్చిందంటు కాలయాపన చేస్తున్నారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేయడమే కాకుండా గ్రామ పంచాయతీ స్టాంపులు, రసీదు బుక్కులు ముద్రించారని ఫిర్యాదులో పేర్కొన్నాం. లోన్‌లు ఇచ్చే వారు ధ్రువీకరణ పత్రాలను పూర్తిగా పరిశీలించి గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఉంటే ఇలా జరిగేది కాదు.

– రాము, ఎంపీవో, నస్రుల్లాబాద్‌

‘డబుల్‌’ లబ్ధిదారులది మరో గోస

సొంత స్థలాల్లో డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకుని ప్రభుత్వ బిల్లుల కోసం ఎదురు చూస్తున్న వారి పరిస్థితి మరోలా ఉంది. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులను తీర్చేందుకు ప్రైవేట్‌ ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. వారి అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న మధ్యవర్తులు నకిలీ పత్రాలు సృష్టిస్తూ లోన్‌లు ఇప్పిస్తున్నారనే ఆరోపణలున్నాయి. హోం లోన్‌ల మంజూరు నస్రుల్లాబాద్‌ మండలం ఎక్కువ సంఖ్యలో ఉండడం అనుమానాలకు తావిస్తోంది. ప్రైవేట్‌ ఫైనాన్స్‌లు క్షేత్రస్థాయిలో సరైన విచారణ లేకుండా లోన్‌లు మంజూరు చేస్తుండడంతో మధ్యవర్తుల దందా మూడు పూలు, ఆరు కాయలుగా సాగుతోందని పలువురు అంటున్నారు.

పోక్సో కేసు నమోదు !

ఎడపల్లి(బోధన్‌): జిల్లా కేంద్రానికి చెందిన యువకుడికి, హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌ ప్రాంతానికి చెందిన బాలికకు వివాహం చేసిన ఇస్మాయిల్‌ ఖాన్‌ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైనట్లు తెలిసింది. మండల కేంద్రానికి చెందిన ఇస్మాయిల్‌ను ముషీరాబాద్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

30 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని దేవునిపల్లి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు బియ్యం తరలిస్తున్న వాహనం పట్టుబడింది. వెంటనే వారు సివిల్‌ సప్లయీస్‌ డీటీ కిష్టయ్యకు సమాచారం అందించారు. సరంపల్లి నుంచి కామారెడ్డికి అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. బెజుగం విజయ్‌కుమార్‌ అనే వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో సెల్‌ఫోన్‌ మాయం

- పోలీస్‌స్టేషన్‌ ఎదుట ప్రయాణికుల తనిఖీ
- ఫోన్‌ దొరకకపోవడంతో బస్సును పంపించేసిన వైనం



ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బోధన్‌ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌ బస్సులో ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ మాయం కావడంతో బస్సును పోలీస్‌స్టేషన్‌ ఎదుట నిలిపి బస్సులోని వారందరినీ తనిఖీ చేసిన ఘటన నాగిరెడ్డిపేటలో బుధవారం చోటుచేసుకుంది. టీజీ 16 జెడ్‌ 0021నంబర్‌ గల ఎక్స్‌ప్రెస్‌ బస్సు బుధవారం ఉదయం బోధన్‌ నుంచి బాన్సువాడ మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరగా, అందులో పశ్చిమబెంగాల్‌ రాష్ట్రానికి చెందిన గోపాల్‌ అనే యువకుడు ఎక్కాడు. బస్సు నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటకు చేరుకోగానే తన ఫోన్‌ను ఎవరో దొంగిలించారని గోపాల్‌ బస్సులోని కండక్టర్‌కు తెలిపాడు. దీంతో బస్సును నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ ఎదుట నిలిపి ఏఎస్సై లచ్చిరాం అందులోని ప్రయాణికులందరినీ కిందకు దింపి తనిఖీ చేశారు. అయినప్పటికీ ఫోన్‌ దొరకకపోవడంతో బస్సును పంపించేశారు.

రోడ్డు ప్రమాదంలో కోడలు.. అనారోగ్యంతో అత్త మృతి

- బషీరాబాద్‌లో విషాదఛాయలు



భూదేవి, లావణ్య (ఫైల్‌)

మోర్తాడ్‌: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌కు చెందిన ఆకుల లావణ్య(40) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందగా అమెరికాలో ఉంటున్న కూతురు వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా అనారోగ్యంతో బాధపడుతున్న లావణ్య అత్త ఆకుల భూదేవి(70) బుధవారం మృతి చెందింది. ఒక్క రోజు వ్యవధిలోనే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అత్తాకోడళ్ల అంత్యక్రియలను ఒకేసారి నిర్వహించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఖలీల్‌వాడి: మురికి కాలువలో పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై ప్రవీణ్‌ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 8వ తేదీన దుబ్బలోని ఓ వైన్స్‌ ఎదుట ఉన్న మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి పడగా, అతడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

నిజామాబాద్‌రూరల్‌: పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్‌ తెలిపారు. నిజామాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చంద్రశేఖర్‌ కాలనీలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది బుధవారం సాయంత్రం దాడి చేశారన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.11,500 నగదును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారన్నారు.

క్రైం కార్నర్‌

విద్యార్థినులను వేధించిన ఉపాధ్యాయుడు

బాన్సువాడ రూరల్‌: మండలంలోని ఓ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులను లైంగిక వేధించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఉపాధ్యాయుడు ల్యాబ్‌ గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యార్థినులు విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని సదరు ఉపాధ్యాయుడిని నిలదీసి దేహశుద్ధి చేసినట్లు తెలిసింది. ‘పోలీసులకు ఫిర్యాదు చేస్తే మీ పరువే పోతుందని, మేము కూడా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఫిర్యాదు చేస్తామని’ కొందరు బెదిరించడంతో తల్లిదండ్రులు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలిక అదృశ్యం

ఎల్లారెడ్డి: మండలంలోని మల్కాపూర్‌ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్‌ బుధవారం తెలిపారు. మండలంలోని మల్కాపూర్‌ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక మంగళవారం కళాశాలకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాటర్‌ ట్యాంకర్‌ చోరీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామ శివారులోని రైతు వేదిక వద్ద ఉన్న వాటర్‌ ట్యాంకర్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. వాటర్‌మెన్‌ స్వామి ఈనెల 7వ తేదీన నర్సరీలోని మొక్కలకు నీరు పట్టి అక్కడే నిలిపివేశాడు. మరుసటి రోజు వెళ్లి చూడగా ట్యాంకర్‌ కనిపించలేదు. గ్రామ కార్యదర్శి చంద్రకళ తాడ్వాయి పోలీస్‌ స్టేషన్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్లాట్‌ కబ్జా చేశారని ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని అమ్మ వెంచర్‌లో ఉన్న తన ప్లాట్‌ను కబ్జా చేశారని పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌కు అక్షయ్‌ అనే వ్యక్తి బుధవారం ఫిర్యాదు చేశారు. అమ్మ వెంచర్‌లో తాను కొనుగోలు చేసిన 160 గజాల ప్లాట్‌ను కార్పొరేటర్‌ భర్త కబ్జా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు ప్లాట్‌ను విక్రయించిన వ్యక్తితోపాటు కార్పొరేటర్‌ భర్తను సంప్రదించినా వారు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇద్దరిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత, అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి, మద్యానికి బానిసై మరో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. మరో వ్యక్తి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

అత్తింటి వేధింపులు తాళలేక..



లావణ్య(ఫైల్‌)

ఖలీల్‌వాడి: అత్తింటి వేధింపులు తాళలేక నిజామాబాద్‌ నగరంలోని ఆర్యనగర్‌లో లావణ్య(23) అనే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి పోలీసులకు చేసిన ఫిర్యాదులో వివరాలు ఇలా ఉన్నాయి.. సుభాష్‌నగర్‌కు చెందిన లావణ్యకు ఆర్యనగర్‌కు చెందిన వెంకటేశ్‌తో ఎనిమిది నెలల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.30 లక్షల నగదుతోపాటు 33 తులాల బంగారాన్ని లావణ్య పుట్టింటివారు ఇచ్చారు. ఆ తరువాత అదనపు కట్నం కోసం లావణ్యను ఆమె భర్త పాపన్నతోపాటు అత్త నాగమణి, భర్త వెంకటేశ్‌ వేధించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం అర్ధరాత్రి పుట్టింట్లో విషం సేవించి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. లావణ్య మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయా సంఘాల నాయకులు నాయుడు రాజు, అంగారి ప్రదీప్‌, తారాచంద్‌, కోనేరు సాయికుమార్‌ తదితరులు డిమాండ్‌ చేశారు.

మద్యానికి బానిసై రైలు కిందపడి..

ఖలీల్‌వాడి: మద్యానికి బానిసైన వ్యక్తి జీవితంపై విరక్తి చెందిన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్‌ నగరంలోని చంద్రశేఖర్‌ కాలనీకి చెందిన మహ్మద్‌ షకీల్‌ (30) లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇటీవల మద్యానికి బానిసైన షకీల్‌ మంగళవారం సైతం మద్యం సేవించి ఇంటికి వెళ్లగా తల్లిదండ్రులు మందలించారు. ఇంట్లో నుంచి బయటికి వచ్చిన షకీల్‌ మాధవనగర్‌ వద్ద గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బరంగెడ్డిలో..



వడ్ల కృష్ణ (ఫైల్‌)

బాన్సువాడ: బీర్కూర్‌ మండలం బరంగెడ్డికి చెందిన వడ్ల కృష్ణ (35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేనిసమయంలో కృష్ణ ఉరేసుకున్నాడని, అతడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కాలోజివాడి గ్రామానికి చెందిన గడ్డంరామకృష్ణ(40) అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉపాధి నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న రామకృష్ణ గతంలో స్థానికంగా రూ.లక్ష అప్పు చేశాడు. రెండు నెలల క్రితం రూ.45వేలు తిరిగి ఇచ్చేసిన రామకృష్ణను మిగతా డబ్బులు ఇవ్వాలని అప్పు ఇచ్చిన వారు తరచూ అడిగారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఈనెల 9న స్వగ్రామానికి వచ్చిన గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య బుధవారం ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

భిక్కనూరు: మండలకేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌ బుధవారం తెలిపారు. కూలెంట్‌ వాటర్‌ సరఫరా చేసే కరీంనగర్‌ జిల్లా ఏజెన్సీకి చెందిన వాహనం భిక్కనూరుకు వచ్చి తిరిగి కామారెడ్డి వైపు వెళ్తుండగా బైపాస్‌ యూటర్న్‌ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. వాహనంలో ఉన్న కరీంనగర్‌ రూరల్‌ మండలం చింతకుంట గ్రామానికి చెందిన సేల్స్‌మెన్‌ శేఖర్‌గౌడ్‌ (45) అక్కడి కక్కడే మృతి చెందగా, డ్రైవర్‌ సాజిద్‌, షకీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో..

జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి తరువాత బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో నిజామాబాద్‌ నగరానికి చెందిన షేక్‌ షకీల్‌ (27)మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. షకీల్‌ తన స్నేహితుడైన జుబేర్‌తో కలిసి మంగళవారం ఉదయం బైక్‌పై సంగారెడ్డికి వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి తరువాత తిరిగి నిజామాబాద్‌కు వస్తుండగా బైక్‌ను లారీ ఢీకొట్టింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు షకీల్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

18 గంటలు.. 4 రోడ్డు ప్రమాదాలు



జాతీయ రహదారిపై బోల్తా పడిన వాహనం

భిక్కనూరు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై 18 గంటల వ్యవధిలో నాలుగు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాలన్నీ కేవలం నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే చోటు చేసుకోగా.. ఇద్దరు మృతి చెందారు. ఏడుగురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై చర్చి సమీపంలో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, టాటా ఏస్‌ వాహనం డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో కరీంనగర్‌ వాసి మృతి చెందాడు. ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే పోలీస్‌ స్టేషన్‌ వెనుకవైపు జాతీయ రహదారిపై మెదక్‌ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న వ్యాన్‌ బోల్తాపడగా పశ్చిమబెంగాల్‌కు చెందిన ఇద్దరూ కూలీలకు గాయాలపాలయ్యారు. అలాగే బుధవారం సాయంత్రం చేగుంట మండలానికి చెందిన ఇద్దరు యువకులు కామారెడ్డి వైపు వెళ్తుండగా బైక్‌ అదుపుతప్పి గాయాలపాలయ్యారు.